18-07-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీరు బుద్ధిహీనుల నుండి వివేకవంతులుగా అయ్యేందుకు ఈ ఆత్మిక యూనివర్శిటీలోకి వచ్చారు, వివేకవంతులు అనగా పవిత్రులు, పవిత్రులుగా అయ్యే చదువును మీరు ఇప్పుడు చదువుతున్నారు"

ప్రశ్న:- వివేకవంతులైన పిల్లల ముఖ్యమైన లక్షణాలను వినిపించండి?

జవాబు:- వివేకవంతులైన పిల్లలు జ్ఞానంలో సదా రమిస్తూ ఉంటారు. వారికి ఈశ్వరీయ నషా ఎక్కి ఉంటుంది. వారి బుద్ధిలో మొత్తం సృష్టి చక్రపు జ్ఞానమంతా ఉంటుంది. వారికి నషా ఉంటుంది - మన బాబా మన కొరకు పరంధామము నుండి వచ్చి ఉన్నారు, మనము వారితో పాటు పరంధామములో ఉండేవారము, మన బాబా జ్ఞానసాగరుడు, ఇప్పుడు మనము మాస్టర్ జ్ఞాన సాగరులుగా అయ్యాము, మనకు వారు ముక్తి-జీవన్ముక్తుల వారసత్వాన్ని ఇవ్వడానికి వచ్చారు.

పాట:- నా మనస్సు అనే ద్వారములోకి ఎవరు వచ్చారు... (కౌన్ ఆయా మేరే మన్ కే ద్వారే...)

ఓంశాంతి. మా పరమపిత పరమాత్మ మాకు సమ్ముఖముగా చదివిస్తున్నారని లేక రాజయోగాన్ని నేర్పిస్తున్నారని జీవాత్మకు తెలుసు. కావున ఇది ఈశ్వరీయ యూనివర్శిటీ వంటిది. దీనిని యూనివర్శిటీ అని ఎందుకు అంటారు? మిగిలిన యూనివర్శిటీలు ఏవైతే ఉన్నాయో అవన్నీ యూనివర్స్ (విశ్వము) కొరకు ఉన్నాయని కాదు. ఉదాహరణకు విదేశాలలో యూనివర్శిటీ ఉంది కానీ అక్కడ తెల్లవారు ఉన్నారు, వారు నల్లవారు వచ్చేందుకు అనుమతి ఇవ్వరు. కావున అది మొత్తం విశ్వం కొరకైతే లేదు. అందుకే దానిని యూనివర్శిటీ అని అనరు. ఇది సత్యాతి-సత్యమైన ఈశ్వరీయ యూనివర్శిటీ అని ఇక్కడ పిల్లలైన మీకు తెలుసు. కానీ ఇది ఎవ్వరూ అర్థం చేసుకోలేరు ఎందుకంటే బుద్ధిహీనులుగా ఉన్నారు. బుద్ధిహీనులను వివేకవంతులుగా తండ్రే తయారుచేస్తారు. మనుష్యులు వివేకవంతుల ఎదురుగా శిరస్సు వంచుతారు. దేవీ-దేవతలకు, సన్యాసులు మొదలైనవారి ఎదురుగా శిరస్సు వంచుతారు. సన్యాసులు పవిత్రముగా ఉంటారు కావున తప్పకుండా వారు వివేకవంతులు. పవిత్రత మంచిది అని భావిస్తారు. ఈ వికారాలే మనుష్యులను హైరానా పరుస్తాయి, అందుకే పవిత్రముగా ఉండే సన్యాసులను గృహస్థులు వివేకవంతులుగా భావిస్తారు మరియు వారి చరణాల ముందు శిరస్సు వంచుతారు. సన్యాస వస్త్రాలు చూడగానే శిరస్సు వంచుతారు, అంతే. ఈ రోజుల్లోనైతే వారి గౌరవము, వారి పేరు తగ్గిపోయింది, అందుకే జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ఇంతకుముందైతే సన్యాసులను చూసి వెంటనే ఆఫర్ చేసేవారు - స్వామీజీ, మా ఇంటికి రండి అని. ఇప్పుడైతే వారు చాలా ఎక్కువమంది అయిపోయారు మరియు తమోప్రధానముగా అయిపోయారు, అందుకే ఎవరైతే చాలా ప్రసిద్ధమైనవారు ఉంటారో, వారికే గౌరవము ఉంటుంది. గొప్ప వ్యక్తులు కూడా వారి ముందు శిరస్సు వంచుతారు, ఎందుకు? నిజానికి సన్యాసుల కన్నా ఎక్కువ చదువుకున్నారు కానీ వారు పవిత్రంగా ఉన్నారు, సన్యసించారు కావున వారిని వివేకవంతులుగా భావించడం జరుగుతుంది. ఇప్పుడు మీరు వివేకవంతులుగా అవుతారు. ఇప్పుడు మీకు రచయిత మరియు రచనల ఆదిమధ్యాంతాలు తెలుసు. కానీ మీలో కూడా అందరికీ ఇంతటి నషా లేదు. నషా ఎక్కడానికి కూడా ఎంతో సమయం పడుతుంది. పూర్తి నషా అయితే అంతిమంలోనే ఉంటుంది. ఇప్పుడు ఎంతెంతగా మీరు పురుషార్థము చేస్తారో, అంతగా నషా ఎక్కుతూ ఉంటుంది. ఆత్మలైన మన తండ్రియైన పరమపిత పరమాత్మ వచ్చి ఉన్నారు అన్నది నిరంతరమూ గుర్తుండాలి. వారు విశ్వాధిపతులుగా తయారుచేయడానికి మనల్ని చదివిస్తున్నారు. కావున పురుషార్థము చేయాలనే శుభ చింత ఉండాలి. అందరికీ ఆ చింత ఉండదు. ఇక్కడ వినేటప్పుడు నషా ఎక్కుతుంది, ఇక్కడి నుండి బయటకు వెళ్ళగానే ఆట సమాప్తము. నంబరువారుగా ఉన్నారు కదా. ఆత్మలైన మన తండ్రి వచ్చారు. మనం వారి వద్ద పరంధామములో ఉండేవారము. ఈ విధముగా ఇంకెవ్వరూ భావించరు. సాధు-సన్యాసులు మొదలైనవారు పవిత్రముగా ఉంటారు. మీలో కూడా నంబరువారుగా ఉన్నారు. మా పరమపిత పరమాత్మ జ్ఞానసాగరుడు, జీవన్ముక్తిదాత, వారు మమ్మల్ని స్వర్గాధిపతులుగా తయారుచేస్తారు అన్న ఈ నిశ్చయము అందరిలోనూ కూర్చోలేదు. ఇక్కడి నుండి పాదము బయట పెట్టగానే ఆ సంతోషము మాయమైపోతుంది. లేదంటే పిల్లలైన మీకు ఎంత సంతోషము ఉండాలి!

నేను కూడా ఈ తనువును ఆధారముగా తీసుకున్నాను. లేదంటే రాజయోగాన్ని ఎలా నేర్పించాలి? నాకు నా శరీరము లేదు. మందిరాలలో చూస్తే అందరికీ తమ శరీరాలు ఉన్నాయి. నేను అశరీరిని. మిగిలినవారందరికీ ఆకార లేక సాకార

శరీరాలు లభించి ఉన్నాయి. నాకు శరీరము లేదు. సోమనాథ మందిరములో లేక శివుని మందిరాలలో ఎక్కడికి వెళ్ళినా సరే అక్కడ నిరాకార రూపమే ఉంది. కేవలం పేర్లు భిన్న-భిన్నమైనవి పెట్టారు. ఆత్మ పరంధామం నుండి వస్తుంది అనైతే తెలుసు. భిన్న-భిన్న శరీరాలను ధారణ చేసి పాత్రను అభినయిస్తుంది. నేను ఈ 84 జన్మల చక్రములోకి రాను. నేను పరంధామ నివాసిని. ఈ శరీరములోకి వచ్చాను. నిరాకారుడు ఎలా వస్తారు? అని మీరు అంటారు. అవును, వారు రాగలరు. మీరు పిత్రులకు తినిపించినప్పుడు ఆత్మ వస్తుంది కదా. శరీరమైతే రాదు. ఆత్మ ప్రవేశిస్తుంది. ఆత్మ ఇంకొక శరీరములోకి ప్రవేశిస్తుందని భావిస్తారు. కొన్ని భూత ఆత్మలు ఎంతో చంచలముగా ఉంటాయి, రాళ్ళు మొదలైనవి విసురుతాయి. ఆత్మ ఎప్పుడైతే శరీరములోకి వస్తుందో, అప్పుడే ఏదైనా చేయగలుగుతుంది. దానిని ఘోస్ట్ (భూతము) అని అంటారు. అశుద్ధ ఆత్మలు కూడా ప్రవేశిస్తాయి. అశుద్ధ ఆత్మలు ఏ విధముగా భ్రమిస్తాయి అని పిల్లలైన మీకు అనుభవం ఉంది. వాటికి శరీరము లభించేంత వరకూ భ్రమిస్తాయి. శుద్ధ ఆత్మలు కూడా వస్తాయి. ఇది కూడా డ్రామాలో రచించబడి ఉంది. ఏదైతే గతించిందో, అది డ్రామా ఆట. తండ్రి అర్థం చేయిస్తారు - నేను వచ్చి సాధారణ వృద్ధ తనువులో ప్రవేశిస్తాను అని. తప్పకుండా అనుభవజ్ఞుని శరీరము కావాలి కదా. బ్రహ్మ పేరు ప్రసిద్ధమైనది. బ్రహ్మ యొక్క సలహా కూడా ప్రసిద్ధమైనది. బ్రహ్మకు మరి ఎక్కడి నుండి సలహా లభించింది? బ్రహ్మ శివబాబా బిడ్డ. వారిది శ్రీమతము. కావున తప్పకుండా ముఖ్యమైన శ్రీమతము బ్రహ్మదే అవ్వాలి, వారిలోకే తండ్రి ప్రవేశిస్తారు. భారతవాసులకు ఈ విషయాల గురించి తెలియదు. వారు అందరూ ఒక్కటే అని భావిస్తారు. శ్రీకృష్ణుడు, శివుడు అందరూ ఒక్కటే అని భావిస్తారు. శ్రీకృష్ణుడిని మహాత్మ, యోగేశ్వరుడు అని అంటారు. కానీ ఎందుకు అంటారు? ఇది అర్థం చేసుకోరు. శ్రీకృష్ణుని ఆత్మ ఇప్పుడు ఈశ్వరుని ద్వారా యోగాన్ని నేర్చుకొని యోగేశ్వరునిగా అవుతున్నారు. ఇది ఎంత గుప్తమైన రహస్యము! పరమాత్మ నామ-రూపాలకు అతీతుడిని, వారికి తమదంటూ శరీరము లేదని మనుష్యులు అంటారు. కానీ మీరు అంటారు - సోమనాథ మందిరము శివుని అవతరణకు స్మృతి చిహ్నము అని. తప్పకుండా కల్పపూర్వము కూడా శివబాబా వచ్చారు మరియు ఇప్పుడు కూడా వచ్చి ఉన్నారు. మళ్ళీ ద్వాపరములో వారి భక్తి ప్రారంభమవుతుంది, శివరాత్రిని జరుపుకుంటారు.

తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు, ఆత్మలైన మీరు పాత్రను అభినయించేందుకు పరంధామం నుండి వచ్చారు. ఆత్మ అవినాశీ. ఆత్మలో 84 జన్మల పాత్ర నిండి ఉంది. ఏ విధముగా తండ్రి పాత శరీరములోకి వచ్చారో, అలాగే మీరు కూడా పాత శరీరములో ఉన్నారు. బాబా ఈ పాత శరీరము నుండి విముక్తులుగా చేసి కొత్తది ఇస్తారు. గవ్వతుల్యము నుండి వజ్రతుల్యముగా ఎలా అవ్వాలి? అన్న యుక్తిని తెలియజేస్తారు. ప్రియుడు ఒక్కరే అని పాడుతారు కూడా. బాబా అంటారు, నేను పరంధామ నివాసిని, మీరు కూడా పరంధామ నివాసులే. నేను అతి పురాతనమైన శరీరములోకి వచ్చాను. మీది కూడా 84 జన్మల అంతిమ జన్మలోని పతిత తనువు. మీరు కూడా స్వయాన్ని ఆత్మగా భావించండి. మనం 84 జన్మలను అనుభవించి పూర్తి చేసాము. ఇప్పుడు మళ్ళీ కొత్త ప్రపంచములో మనకు కొత్త శరీరము లభిస్తుంది. కావున ఎంత సంతోషముగా ఉండాలి! నంబరువారుగా ఉన్నారు. కొందరు పూర్తిగా మందబుద్ధులుగా ఉన్నారు. మాయ పూర్తిగా రాతిబుద్ధి కలవారిగా చేసేసింది. వేడిగా ఉన్న పెనముపై నీరు వేస్తే అవి పూర్తిగా ఆవిరైపోతాయి, అలాగే వారూ వేడి పెనముల వలే ఉన్నారు. అరే, మీరు స్వయాన్ని కేవలం ఆత్మగా, తండ్రి సంతానముగా భావించండి. అలా కూడా భావించరు! ఒకవేళ భావించినట్లయితే మరి ఆశ్చర్యవంతులై ఎందుకు పారిపోతారు? మాయ చాలా శక్తివంతమైనది. ఏదైనా పొరపాటు చేస్తే మాయ చెంపదెబ్బ వేస్తుంది. అరే, బాబా వారసత్వాన్ని ఇవ్వడానికి వచ్చారు, అయినా మీరు వికారులుగా అవుతారు! చాలా గట్టి చెంపదెబ్బ వేస్తుంది. తండ్రి చెంపదెబ్బ వేయరు. మాయ చెంపదెబ్బ వేసి మొహం తిప్పేస్తుంది. ఇలా ఎంతోమంది మాయ చెంపదెబ్బలు తింటూ ఉంటారు. మాయ కూడా అంటుంది - నీవు తండ్రిని స్మృతి చేయకపోతే నేను దెబ్బ వేస్తాను. మాయకు ఆజ్ఞ లభించి ఉంది. బుద్ధిహీనులను వివేకవంతులుగా తయారుచేయాలి, మరి సేవ ఎందుకు చేయరు. ఇప్పటికీ ఇంకా మాయ దెబ్బలు తింటూనే ఉండాలా! ఎన్నో దెబ్బలు తింటూ ఉంటారు - కొందరికి క్రోధము, కొందరికి మోహము యొక్క దెబ్బలు తగులుతాయి. తండ్రి అంటారు - మీరు సర్వస్వమూ సమర్పణ చేసి ట్రస్టీగా ఉండండి. వికారాలను కూడా దానంలో ఇచ్చిన తర్వాత మళ్ళీ ఎందుకు ఉపయోగిస్తారు! వికారాలకు రూపమేమీ లేదు. ధనము విషయములో ట్రస్టీగా అయి ఉండండి అని చెప్తారు. దానిని ఉపయోగించండి, కానీ చాలా జాగ్రత్తగా, తండ్రి శ్రీమతముతో ఉపయోగించండి. ధనంతో వికర్మలు ఏవీ చేయకండి. లేదంటే దాని భారమంతా మీ తలపైకి వస్తుంది.

మాయ చాలా తమోప్రధానమైనది. వీరు తండ్రిని సరిగ్గా స్మృతి చేయడం లేదు, అందుకే వీరికి గట్టిగా దెబ్బ వేయాలి అని దానికి కూడా తెలుసు. మాయ అంటుంది - ఒకవేళ తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయకపోతే నేను

చెంపదెబ్బ వేస్తాను. చాలామంది పిల్లలు వ్రాస్తారు కూడా - బాబా, మాయ చెంపదెబ్బ కొట్టింది. బాబా కూడా వ్రాస్తారు - అవును పిల్లలూ, మాయకు బాగా దెబ్బ వేయమని ఆజ్ఞ లభించి ఉంది ఎందుకంటే మీరు నావారిగా అవ్వరు. మిమ్మల్ని సదా సుఖవంతులుగా చేయడానికి వచ్చాను, అయినా కూడా పిల్లలైన మీరు స్మృతి చేయరు. నిజానికి ఇది చాలా సహజము కానీ సమయం పడుతుంది. లేదంటే తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేస్తూ సంతోషమనే పాదరసము పైకి ఎక్కిపోవాలి. చివరికి స్మృతి చేస్తూ-చేస్తూ వెకిళ్ళులా వస్తాయి - అంతే, నేను ఇక తండ్రి వద్దకు వెళ్ళిపోతాను, ఆ తర్వాత స్వర్గములోకి వచ్చేస్తాను. పూర్తిగా ఈశ్వరీయ నషాలో నిమగ్నమై వెళ్ళిపోతారు.

అచ్ఛా! ఆత్మ పరమపిత పరమాత్మకు ప్రేయసి అన్నది ఎవరికీ తెలియదు. సత్యాతి-సత్యమైన ప్రేయసులు మీరే. అర్ధకల్పం మీరు ప్రేయసులుగా అయి ప్రియుడిని ఎంతగానో స్మృతి చేస్తారు. కానీ ఆత్మ పరమాత్మునికి ప్రేయసిగా అవుతుంది అనేది తెలియదు. వారు - ఆత్మయే పరమాత్మ, పరమాత్మయే ఆత్మ అని అంటారు. ఇక్కడైతే చాలా తేడా ఉంది. పరమాత్మ ప్రియుడని మీకు తెలుసు. ఆ పవిత్ర ఆత్మ మనల్ని ఎంత సుందరముగా తయారుచేస్తారు! ఆత్మలైన మనము అశుద్ధముగా అవ్వడంతో ఆభరణాలు కూడా అశుద్ధముగా అయిపోయాయి. బాబా - మళ్ళీ సుందరముగా తయారుచేయడానికి వచ్చారు, అప్పుడు శరీరము కూడా బంగారు యుగముది లభిస్తుంది. బంగారములో మలినాలను కలుపుతారు కదా.

ఇప్పుడు చూడండి - ఇది ఆదిదేవుని మందిరము. కొందరు వారికి మహావీర్ అన్న పేరును పెట్టారు. అర్థమేమీ తెలియదు. హనుమంతుడిని కూడా మహావీర్ అని అంటారు. ఇప్పుడు హనుమంతుడు ఎక్కడ, ఆదిదేవ్ ఎక్కడ, వారిని కూడా మహావీర్ అని అనేస్తారు. జైన మహారాజు ముని ఏది చెప్తే అది కొనసాగుతూ వచ్చింది. ఈ రోజుల్లోనైతే రిద్ధి-సిద్ధులు కూడా బాగా పెరిగిపోయాయి. ఈ బాబాకు అందరి గురించి తెలుసు. వాళ్ళు ఎంతో కష్టపడతారు. చేతి నుండి కుంకుమపువ్వు వచ్చేలా చేస్తారు. మనుష్యులు - ఇది అద్భుతము! అని భావిస్తారు. వెంటనే అనుచరులుగా అయిపోతారు. రిద్ధి-సిద్ధులు చేసేవారికైతే ఎంతోమంది అనుచరులు ఉంటారు. ఇక్కడ అటువంటి విషయమేదీ లేదు.

బాబా అంటారు - నేను 5,000 సంవత్సరాల క్రితం వలె వచ్చాను. ఈ విధంగా ఇంకెవ్వరూ అనలేరు. పిల్లలు అంటారు - బాబా, 5000 సంవత్సరాల క్రితం మేము వచ్చాము, మీ నుండి స్వర్గ వారసత్వాన్ని పొందాము. ఇప్పుడు మళ్ళీ వచ్చి ఈ బ్రహ్మ ద్వారా పరమపిత పరమాత్మ అయిన శివుని పిల్లలుగా అయ్యాము. ప్రపంచము కలియుగములో ఉంది. కలియుగములో బ్రాహ్మణులు ఎక్కడి నుండి వచ్చారు? బ్రాహ్మణులు సంగమములో కావాలి. పాదాలు మరియు పిలక - సంగమము అయినట్లు కదా. ఇది శూద్రులు మరియు బ్రాహ్మణుల సంగమము. శూద్రుల నుండి తిరిగి బ్రాహ్మణులుగా అవుతారు. ఈ 84 జన్మల చక్రము గురించి ఎవరికీ తెలియదు. మనం బ్రాహ్మణులము అని, బ్రహ్మ సంతానముగా ప్రాక్టికల్ గా అయ్యాము అని మీకు తెలుసు. ఆ బ్రాహ్మణులతో మీరు ఇలా చెప్పవచ్చు - మీరు స్వయాన్ని బ్రహ్మ సంతానముగా పిలుచుకుంటున్నారు, అచ్ఛా, మరి ఆ బ్రహ్మకు తండ్రి ఎవరు? వారు చెప్పలేకపోతారు. డబ్బాలో మట్టి పెంకుల వలె ఉంటుంది (చెప్పినా అర్థం కానీ వ్యక్తుల బుద్ధిలో ఏమీ ఉండదు). అంతే, బ్రాహ్మణులమైన మేమే భగవంతులము అని అంటారు. మీరందరూ భక్తులుగా ఉండేవారు. ఇప్పుడు - మేము లక్ష్మిని వరించేందుకు యోగ్యులుగా అవుతున్నాము అని అంటారు. దీని కోసం పురుషార్థము చేయవలసి ఉంటుంది. మేము పరంధామం నుండి వచ్చాము అని భావించండి. ఇప్పుడు బాబా మళ్ళీ తిరిగి తీసుకువెళ్ళేందుకు వచ్చారు. మనం కూడా బ్రహ్మాండానికి అధిపతులము. బాబా కూడా పాత తనువులోకి వచ్చారు. మనం కూడా పాత తనువులో ఉన్నాము. తండ్రి అంటారు - నేను కూడా పాత తనువును తీసుకోవలసి ఉంటుంది. ఇప్పుడు తండ్రినైన నన్ను స్మృతి చేసినట్లయితే వికర్మలు వినాశనమవుతాయి. వారు సమయం కూడా ఇస్తారు. పాండవ గవర్నమెంట్ సేవ తక్కువలో తక్కువ ఎనిమిది గంటలు జరగాలి, రాజయోగాన్ని నేర్పించాలి, శంఖ ధ్వని చేయాలి. మీరు శ్రీమతము ద్వారా విశేషముగా భారత్ ను మరియు మొత్తం ప్రపంచమంతటినీ స్వర్గముగా తయారుచేస్తారు. స్వర్గములోకి కేవలం మీరు మాత్రమే వస్తారు, ఇతర ధర్మాలవారు రారు. బ్రాహ్మణ, దేవత, క్షత్రియ, వైశ్య, శూద్ర - దీనిని విరాట రూపము అని అంటారు. విరాట రూపము యొక్క చిత్రము కూడా ఒకటి తయారుచేయాలి, తద్వారా మనుష్యులకు సహజముగా అర్థమవ్వాలి. విష్ణువును విరాట రూపములో చూపించారు. చిత్రమైతే తప్పకుండా కావాలి కదా. స్కూల్లో కూడా చిత్రాలు పెడతారు కదా. లేదంటే ఏనుగు ఎలా ఉంటుంది అనేది పిల్లలకు ఎలా తెలుస్తుంది? చిత్రాల ద్వారా చూపిస్తారు. కావున ఇవి కూడా నాలుగు యుగాలు. ఇప్పుడు ఇది కలియుగము. తప్పకుండా చక్రము తిరుగుతుంది. బ్రాహ్మణులైతే సంగమయుగములో ఉంటారు. మిగిలినవారు దైహికమైన బ్రాహ్మణులు, పండాలు. వారు

బ్రహ్మాముఖవంశావళి కారు. బ్రహ్మాముఖవంశావళికి తాతగారి నుండి వారసత్వము లభిస్తుంది. ఆ బ్రాహ్మణులకు వారసత్వము ఎక్కడ నుండి లభిస్తుంది! ఈ విషయాలనైతే మీలో కూడా నంబరువారుగా అర్థం చేసుకోగలరు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. బుద్ధి ద్వారా అంతటినీ సమర్పణ చేసి ట్రస్టీలుగా ఉండాలి. చాలా జాగ్రత్తగా శ్రీమతమనుసారముగా ప్రతి కార్యాన్ని చేయాలి.

2. బాబాను మరియు వారసత్వాన్ని స్మృతి చేస్తూ అపారమైన సంతోషాన్ని అనుభవం చేయాలి. బాబా స్మృతితో ఈశ్వరీయ నషాలో నిమగ్నమైపోవాలి. సత్యమైన ప్రేయసిగా అవ్వాలి.

వరదానము:- ఇముడ్చుకునే మరియు సర్దుకొనే శక్తుల ద్వారా ఏకాగ్రతను అనుభవము చేసే సార స్వరూప భవ

దేహము, దేహ సంబంధాలు మరియు పదార్థాల విస్తారము చాలా పెద్దది, అన్ని రకాల విస్తారమును సార రూపములోకి తీసుకువచ్చేందుకు ఇముడ్చుకునే మరియు సర్దుకొనే శక్తులు అవసరము. అన్ని రకాల విస్తారమును ఒక్క బిందువులో ఇమిడ్చివేయండి. నేను కూడా బిందువు, తండ్రి కూడా బిందువు, ఒక్క బిందువైన తండ్రిలోనే మొత్తము ప్రపంచమంతా ఇమిడి ఉంది. కావున బిందు రూపముగా అనగా సార స్వరూపముగా అవ్వటము అనగా ఏకాగ్రమవ్వటము. ఏకాగ్రతా అభ్యాసము ద్వారా క్షణములో ఎక్కడ కావాలనుకుంటే అక్కడ, ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు, బుద్ధి ఆ స్థితిలోనే స్థితి అవ్వగలదు.

స్లోగన్:- ఎవరైతే సదా ఆత్మికత యొక్క స్థితిలో ఉంటారో, వారే ఆత్మిక గులాబీలు.